

అప్రమత్తమయ్యేనా..? 8లో▸

ఖానాపూర్, కడెం మండలాల పరీవాహకంలో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఉత్తర వాహినీ గౌతమి, గోదావరి నది పరీవాహకంలో ముందు జాగ్రత్తలు తీసుకోవడంలో జిల్లా యంత్రాంగం విఫలమవుతోంది.



దేవరకోట ఆలయ చైర్మన్‌గా శ్రీధర్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దేవరకోట ఆలయ చైర్మన్‌గా ఆమెడ శ్రీధర్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని సెక్రటేరియేట్‌లో దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఈమేరకు నియామక ఉత్తర్వులు శుక్రవారం అందించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.3 /24.2

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. గాలిలో తేమ అధికంగా ఉండి ఉక్కపోతగా అనిపిస్తుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

నెరవేరిన కొలువు కల



సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు (ఫైల్)

- వీఆర్‌ఏ వ్యవస్థ రద్దు
- కొత్త పోస్టుల్లోకి గ్రామ సేవకులు
- సూపర్ న్యూమరికల్ పోస్టుల్లో సర్దుబాటు
- ఇక వీరంతా ప్రభుత్వ ఉద్యోగులు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- జిల్లాలో 748 మందికి లబ్ధి
- నేడో రేపో ఆర్డర్లు అందజేత

జిల్లాలోని వీఆర్‌ఏల వివరాలు..

మొత్తం వీఆర్‌ఏలు: 748
ప్రస్తుతం పనిచేస్తున్నవారు: 727
డైరెక్టు రిక్రూట్ అయినవారు : 61
వారసత్వంగా నియామకమైనవారు: 666
డిగ్రీ, ఆపై అర్హత ఉన్నవారు : 83
ఇంటర్ అర్హత ఉన్నవారు : 128
పదవ తరగతి, ఆలోపు అర్హత : 516

నిర్మల్/నిర్మల్ ఖిల్లా: రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్న రాష్ట్రప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. గతంలో వీఆర్‌వో వ్యవస్థను రద్దు చేసి, వారిని వివిధ శాఖల్లోకి పంపింది. తాజాగా వీఆర్‌ఏ వ్యవస్థనూ రద్దు చేసి.. వీఆర్‌ఏలను వివిధ శాఖల్లో విలీనం చేస్తోంది. ఇందుకోసం కొత్తగా సూపర్ న్యూమరరీ పోస్టులను సృష్టించింది. వీఆర్‌ఏల విలీన ప్రక్రియకు సంబంధించిన మార్గదర్శకాలను ఇదివరకే జారీ చేసింది. సర్దుబాటు బాధ్యతను కలెక్టర్లకే అప్పగించింది. వివిధ శాఖల్లో సూపర్ న్యూమెరరీ పోస్టులు సృష్టించి రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు చేసింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు.

ఏళ్లుగా చాలీచాలని వేతనం..

ఏళ్లుగా చాలీచాలని వేతనంతో విధులు నిర్వహిస్తున్న వీఆర్‌ఏల కల ఎట్టకేలకు నెరవేరుతోంది. రెవెన్యూ శాఖలో కిందిస్థాయి ఉద్యోగులుగా తాత్కాలిక గౌరవ వేతనంతో వివిధ రకాల గ్రామస్థాయి విధులు నిర్వహిస్తున్న వీఆర్‌ఏలను ప్రభుత్వంలో విలీనం అయ్యారు.

వివిధ శాఖల్లోకి..

రద్దయిన గ్రామ రెవెన్యూ సహాయకులను రెవెన్యూతోపాటు మున్సిపల్, నీటిపారుదల, మిషన్ భగీరథ శాఖల్లోకి వీరిని విలీనం చేయనున్నారు. ఇందుకోసం ఆయా శాఖల్లో సూపర్ న్యూమరరీ పోస్టులను ప్రభుత్వం సృష్టించింది. ఇప్పటి వరకు గ్రామ సహాయకులుగా చేసిన వీరంతా ఆయాశాఖల్లో కేటాయించిన పనులను చేయాల్సి ఉంటుంది. రెవెన్యూలో జూనియర్ అసిస్టెంట్, మున్సిపాలిటీలో వార్డు అధికారి(జూనియర్ అసిస్టెంట్ కేటగిరీ) ఖాళీ పోస్టులను వీరితో భర్తీ చేయనున్నారు. మిగిలిన వారి కోసం.. రెవెన్యూలోనే రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్/చైన్‌మన్, ఇరిగేషన్‌లో లస్కర్/హెల్పర్, మిషన్ భగీరథలో హెల్పర్‌లుగా సూపర్ న్యూమరరీ పోస్టులను కేటాయించారు. దీంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది.

కారుణ్య నియామకాలు..

జిల్లాలో మొత్తం 726 మంది వీఆర్‌ఏలు ఉండగా, ఇందులో ఏళ్లుగా పనిచేస్తున్న వారిలో చాలామంది వయసు పైబడింది. కొంతమంది ఇప్పటికే తమ పిల్లలు, మనుమలతో వ్యవస్థలో కొనసాగింప చేస్తున్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం 61 ఏళ్లు పైబడిన వీఆర్‌ఏల వారసులను కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇస్తుంది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలనూ పేర్కొంది. ఈఏడాది జులై 31వరకు వీఆర్‌ఏ వయసును పరిగణనలోకి తీసుకుంటారు. ఇలాంటి నియామకాల కోసం దరఖాస్తు ఫార్మాట్‌నూ రూపొందించారు. ప్రస్తుతం జిల్లాలో ఇలాంటి వారంతా సంబంధిత ఫార్మాట్ ప్రకారం ఇతర కుటుంబసభ్యుల నో అబ్జెక్షన్ పత్రాలు, ఇతర ధ్రువపత్రాలను ఇచ్చే పనిలో ఉన్నారు. విద్యార్హతల ప్రకారం పోస్టింగ్ ఇవ్వనున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం ఒక్కసారి ఒక శాఖలో కేటాయించిన తర్వాత తమను మార్చమని అడగడానికి కూడా వీఆర్‌ఏలకు అవకాశం లేదు. ఇక ఒకటి రెండు రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్డర్ అందుకోబోతున్నారు. ఈసందర్భంగా వారు తమ సంతోషాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు.

వీఆర్‌ఏల సర్దుబాటు

- ఉమ్మడి జిల్లాలో 1,484 మందికి కేటాయింపు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గ్రామ రెవెన్యూ అసిస్టెంట్ల(వీఆర్‌ఏ)ను ఆయా శాఖల్లో సూపర్ న్యూమెరరీ పోస్టులు సృష్టించి రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు చేసింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ కె.రామక్రిష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ప్రభుత్వం వీఆర్‌ఏలను విద్యార్హతల ఆధారంగా సర్దుబాటు చేసేందుకు ప్రక్రియ ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో నిరక్ష్యరాసులు, పది, ఇంటర్, డిగ్రీ, డిగ్రీపైనా చదివిన వారిని అర్హతను బట్టి రెవెన్యూ, మున్సిపల్, సాగునీటి, మిషన్ భగీరథ శాఖల్లో సర్దుబాటు చేశారు. ఇందులో కనీస విద్యార్హత లేని వారిని మిషన్ భగీరథలో హెల్పర్‌గా, డిగ్రీ, ఆపైనా ఉన్నవారిని రెవెన్యూ శాఖలోనే తిరిగి జూనియర్ అసిస్టెంట్ హోదాతో పోస్టులు కేటాయించారు. వీఆర్‌ఏ వ్యవస్థ రద్దయ్యాక ఎలాంటి జాబ్‌చార్టర్ లేకుండా గౌరవ వేతనంతో పని చేసిన ఉమ్మడి జిల్లాలో మొత్తం 1484మంది వీఆర్‌ఏలకు ఆయా శాఖల్లో సర్దుబాటు చేయడంతో లబ్ధి చేకూరింది. కొత్త పోస్టుల హోదా ప్రకారం జీత భత్యాలు అందనున్నాయి.

జిల్లాల వారీగా కేటాయింపు ఇలా..

కేటాయించిన శాఖలు	ఆదిలాబాద్	మంచిర్యాల	నిర్మల్	కుమురంభీం
జూనియర్ అసిస్టెంట్ (రెవెన్యూ)	76	75	73	59
వార్డు ఆఫీసర్(మున్సిపల్)	07	47	28	24
రికార్డు అసిస్టెంట్ (రెవెన్యూ)	61	61	64	52
ఆఫీస్‌చైన్‌మెన్ (రెవెన్యూ)	11	12	11	10
లస్కర్ (సాగునీటి)	81	83	104	93
హెల్పర్(సాగునీటి)	07	08	24	17
మిషన్ భగీరథ(హెల్పర్)	102	96	108	90
మొత్తం పోస్టులు	345	382	412	345

సుదీర్ఘ పోరాట ఫలితం..



నాది సారంగాపూర్ మండలం చించోలి బి స్వగ్రామం, పదేళ్లుగా వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్నాను. మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించాలని అనేకమార్లు సమ్మెలు, ధర్నాలు, ముట్టడి వంటి కార్యక్రమాలు చేశాం. సుదీర్ఘ పోరాట ఫలితంగా ప్రభుత్వం మమ్మల్ని రెగ్యులరైజ్ చేయాలని నిర్ణయించడం సంతోషంగా ఉంది. నాకు డిగ్రీ అర్హత ఉంది. జూనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగం వస్తుంది. – మట్ట గంగాధర్, వీఆర్‌ఏ, చించోలి(బీ), సారంగపూర్ మండలం

క్రమబద్ధీకరణతో ఆనందం..



ఇన్నేళ్లు నిర్మల్ మండలంలో వీఆర్‌ఏగా కింది స్థాయి ఉద్యోగం చేస్తున్నాం. వీఆర్‌ఏగా రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన పోటీ పరీక్ష ద్వారా నియమితులయ్యాం. ప్రస్తుతం పేస్కేల్ తో కూడిన ఉద్యోగాలు ఇవ్వనుండడం సంతోషంగా ఉంది. ఆర్థిక భరోసా ఉద్యోగ భద్రత పొందబోతున్నాం. – ఎస్ మౌనిక, వీఆర్‌ఏ, నిర్మల్

కొత్త జీవితాన్నిస్తుంది..



రాష్ట్రస్థాయిలో పోటీ ప్రవేశ పరీక్ష ద్వారా నియామకమయ్యాం. రెవెన్యూ శాఖకు సంబంధించిన గ్రామస్థాయిలో అనేక విధులు నిర్వహించాం. అయినా ఉద్యోగ భద్రత ఉండేది కాదు. పదేళ్లుగా గౌరవ వేతనంతోనే నెట్టుకొచ్చాం. రాష్ట్ర ప్రభుత్వం మా సేవల్ని గుర్తించి రెగ్యులర్ ఉద్యోగులుగా పేస్కేలు వర్తింపజేయడం మాకు కొత్త జీవితాన్ని అందిస్తుంది. – ఎస్.సవిత, వీఆర్‌ఏ, మేడిపల్లి

18 ఏళ్లుగా నిరీక్షణ...



నేను మంజులాపూర్ వీఆర్‌ఏగా 2006 నుంచి పనిచేస్తున్నాను. రూ.721 వేతనం ఉన్నప్పుడు వీఆర్‌ఏగా చేరాను. 18 ఏళ్లుగా వీఆర్‌ఏగానే అనేక సేవలను అందిస్తూ వస్తున్న. మాకు పేస్కేల్ ఇవ్వాలని, ఉద్యోగ భత్ర కల్పించాలని కొన్నేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవిస్తూ వస్తున్నాం. ఈ క్రమంలో రెగ్యులరైజ్ చేయడం సంతోషాన్ని ఇచ్చింది. – షేక్ జమాల్, వీఆర్‌ఏల సంఘం జేఏసీ జిల్లా నాయకుడు

మద్యం టెండర్లు షురూ..

- రిజర్వేషన్ల కేటాయింపు పూర్తి
- శుక్రవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ
- డిసెంబర్ 1 నుంచి కొత్త షాపుల నిర్వహణ
- ఎన్నికలవేళ పోటెత్తనున్న అప్లికేషన్లు..



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: నూతన మద్యం పాలసీకి రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలలు ముందుగానే నోటిఫికేషన్ జారీ చేసింది. 2023–25 వరకు రెండేళ్లపాటు షాపుల నిర్వహణకు రిజర్వేషన్ల ప్రక్రియను కలెక్టర్ లాటరీ ద్వారా పూర్తి చేశారు. శుక్రవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. దీంతో మద్యం వ్యాపారులు షాపులు దక్కించుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. దరఖాస్తులకు డబ్బులు సమకూర్చుకోవడం, సిండికేట్‌గా మారేందుకు సహచరులను జమచేసే పనిలో నిమగ్నమయ్యారు.

రిజర్వేషన్ల ప్రకారం షాపుల కేటాయింపు...

గత మద్యం పాలసీ విధానాన్ని ప్రస్తుతం అమలు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, గౌడ కులాలకు మద్యం షాపుల్లో రిజర్వేషన్ కొనసాగిస్తున్నారు. జిల్లాలో మొత్తం 47 షాపులు ఉండగా.. ఇందులో 5 ఎస్సీ, ఒక ఎస్టీ, 3 గౌడ కులానికి రిజర్వు చేశారు. ఈ మేరకు కలెక్టర్ వరుణ్‌రెడ్డి లాటరీ పద్ధతిన రిజర్వేషన్ల షాపులు కేటాయింపు పూర్తి చేశారు.

దరఖాస్తుల స్వీకరణ...

మద్యం షాపుల కేటాయింపులో భాగంగా శుక్రవారం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 18వ తేదీ సాయంత్రం వరకు స్వీకరిస్తారు. గతంలో మాదిరిగా అన్ని నిబంధనలను అనుసరించి రిజర్వేషన్ల షాపుల దరఖాస్తులు తీసుకుంటారు. ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. లాటరీలో మద్యం షాపు దక్కినా.. దక్కకపోయినా.. దరఖాస్తు రుసుము తిరిగి ఇవ్వరు.

గత సీజన్‌లో 568 దరఖాస్తులు..

గత సీజన్‌లో జిల్లాలోని 47 షాపులకు 568 దరఖాస్తులు వచ్చాయి. దీంతో దరఖాస్తుల రూపేన రాష్ట్ర ప్రభుత్వానికి రూ.11.36 కోట్ల ఆదాయం సమకూరింది.

ఎన్నికల సీజన్...

వచ్చే రెండేళ్లలో అసెంబ్లీ, ఎంపీ, సర్పంచ్, స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సీజన్‌లో ఎక్కువ మద్యం షాపులు దక్కించుకుంటే అధిక లాభాలు పొందే అవకాశం ఉంది. మద్యం వ్యాపారులు ఆ దిశగా కసరత్తు ప్రారంభించారు. రిజర్వేషన్ల షాపులను ఆయా వర్గాల ద్వారా దరఖాస్తులు చేయించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందుకు వ్యాపారులే డబ్బులు సమకూరుస్తామని చెబుతున్నారు.

దరఖాస్తు ఇలా..

మద్యం దుకాణాలకు టెండర్ వేసే అభ్యర్థులు దరఖాస్తు వెంట ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, రూ.2 లక్షల డీడీ లేదా చెక్కు జతచేయాలి. డిఫాల్టర్లు ఆర్థికంగా దివాలా తీసినవారు టెండర్‌కు అనర్హులు, 21 సంవత్సరాల్లోపు ఉన్నవారు మద్యం టెండర్ వేయరాదు. ఏదైనా రిజర్వేషన్ కలిగి ఉంటే ఆ కులానికి సంబంధించిన కుల ధ్రువీకరణ పత్రంతో జిల్లా ఆబ్కారీ శాఖ కార్యాలయంలో లేదా కమిషనర్ ఆబ్కారీ శాఖ నాంపల్లి కార్యాలయంలో అందజేయాలి.

ప్రతీ దరఖాస్తుకు రూ.2 లక్షల డీడీ..

మద్యం టెండర్లను శుక్రవారం నుంచి ఈనెల 18వ తేదీ సాయంత్రం 6గంటల వరకు స్వీకరిస్తాం. 21న డ్రా ద్వారా ఎంపిక చేస్తాం. కొత్తగా షాపులు దక్కించుకున్నవారు డిసెంబర్ 1న షాపులు ప్రారంభించాల్సి ఉంటుంది. ప్రతీ దరఖాస్తుకు రూ.2 లక్షల డీడీ చెల్లించాలి.
– జి.శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్, నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి అధికారి

నిర్మల్‌కు ట్రాఫిక్, మహిళా పోలీస్ స్టేషన్ మంజూరు



మాట్లాడుతున్న నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్‌టౌన్: నిర్మల్ పట్టణానికి ట్రాఫిక్, మహిళా పోలీస్ స్టేషన్ మంజూరయ్యాయని డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరుగుతుందన్నారు. దీనిని త్వరలోనే అధిగమిస్తామని తెలిపారు. సైబర్ నేరగాళ్ల ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయని, సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచితుల కాల్స్‌కు స్పందించొద్దని సూచించారు. షాపింగ్ చేసే సమయంలో లక్కీడ్రా కూపన్లపై వ్యక్తిగత వివరాలు రాయొద్దని తెలిపారు. సైబర్ నేరగాళ్లు పంపే లింకులను క్లిక్ చేయవద్దని పేర్కొన్నారు. డబ్బులు ఫ్రీగా వస్తాయని చెప్పగానే ఆశపడి సైబర్ నేరగాళ్లకు ఓటీపీ చెప్పడం, ఆన్‌లైన్‌లో అపరిచితులతో పరిచయాలకు పెంచుకోవడం సరికాదన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలకు లోబడి ఉండాలని తెలిపారు. ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయొద్దన్నారు. పట్టణ సీఐ పురుషోత్తం, రూరల్ సీఐ శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకోవడానికే పాదయాత్ర



శ్రీహరి రావుకు స్వాగతం పలుకుతున్న మహిళలు

లక్ష్మణచాంద: నిర్మల్ నియోజవర్గ ప్రజల సమస్యలు తెలుసుకోవడానికే పాదయాత్ర చేపట్టినట్లు కాంగ్రెస్ నాయకుడు కూచాడి శ్రీహరిరావు తెలిపారు. వస్తున్నా మీకోసం పేరుతో మండలంలోని బోరిగాం నుంచి పాదయాత్ర శుక్రవారం ప్రారంభించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. బోరిగాం తండా, ఒడ్డెపల్లి, బోరిగాం గ్రామాలలో పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను వివరించారు. అనంతరం కార్నర్ మీటింగ్ నిర్వహించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలు ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పింఛన్లు రూ.4 వేలు, రైతులకు పెట్టుబడి సాయం ఏడాదికి రూ.15 వేలు, పంట రుణాలు రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తామన్నారు. కుటుంబ పాలన సాగిస్తున్న కేసీఆర్‌కు, అవినీతి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, సండే నేత మహేశ్వర్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మి, నాయకులు సాద సుదర్శన్, ఈటల శ్రీనివాస్, ఒడ్నాల రాజేశ్వర్, గంగాధర్ గౌడ్, నాందేడపు చిన్ను, రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, రవి, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే విఠల్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వీవోఏల సంఘం సభ్యులు

తానూరు: వీవోఏల సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని తానూరు మండల వీవోఏలు ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి హైదరాబాద్‌లో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వీవోఏల సంఘం మండల అధ్యక్షుడు మోహన్ మాట్లాడుతూ గ్రామాల్లో మహిళా సంఘాలకు సేవలు అందిస్తున్న వీవోఏలకు ప్రభుత్వం అందిస్తున్న వేతనం సరిపోవడం లేదన్నారు. వీవోఏలకు నెలకు రూ. 26 వేల వేతనంతోపాటు ఉద్యోగభద్రత కల్పించేలా చూడాలన్నారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించినవారిలో సంఘం సభ్యులు శివరాం, ముత్యం, దిలీప్, రాజు, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, సర్పంచ్ గోపా సాయినాథ్, నాయకులు చంద్రకాంత్ యాదవ్ ఉన్నారు.

'పల్లె వెలుగు'పై పాము



నిచ్చెనకు పాము

నర్సాపూర్(జి): కుంటాల మండలం ఓలా నుండి నిర్మల్ వెళ్తున్న పల్లె వెలుగు బస్సులో పాము కలకలం సృష్టించింది. బస్సు నర్సాపూర్(జి) బస్‌స్టాప్ వద్ద ఉదయం 10:30 గంటల ప్రాంతంలో ఆగింది. బస్ వెనక భాగంలోని నిచ్చెనకు పాము చుట్టుకుని ఉండటాన్ని ప్రయాణికులు గమనించారు. విషయాన్ని డ్రైవర్‌కు తెలుపడంతో గ్రామానికి చెందిన బాబూ పామును పట్టి కిందకు తీసుకువచ్చి చంపేశాడు.

ప్రాథమిక విద్య పటిష్టం

- అభ్యాసాల సాధనకు విద్యార్థులకు వర్క్‌బుక్స్
- సామర్థ్యాలు పెరుగుతాయంటున్న ఉపాధ్యాయులు
- ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు



ప్రభుత్వం అందించిన వర్క్‌బుక్స్‌తో విద్యార్థులు

నిర్మల్ ఖిల్లా: ప్రాథమిక తరగతుల విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల పెంపునకు చదవడం, రాయడం ప్రక్రియలు కీలకం. పుస్తక పఠనం, పరిశీలన, అవగాహన, క్రియేటివిటీ, ఆలోచనాత్మక అనుభవం వంటి విషయాలతోపాటు క్లిష్టమైన విషయాలను ఆకళింపు చేసుకోవడం చదవడం, రాయడం ద్వారా సాధ్యమవుతుంది. ఇదే అంశాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం అన్ని పాఠశాలలకు ఒకటి నుంచి ఐదో తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం వర్క్‌బుక్స్ రూపొందించింది. వీటిని ఇప్పటికే ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసింది. జిల్లాలోని 535 పాఠశాలలకు వర్క్‌బుక్స్ చేరుకున్నాయి. పాఠం పూర్తయిన వెంటనే అభ్యాసాలను ప్రాక్టీస్ చేసేలా వర్క్‌బుక్ రూపొందించారు.

విద్యార్థులకు ప్రయోజనం...

ఇప్పటికే ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు తొలిమెట్టు శిక్షణ ద్వారా విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను సాధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగానే విద్యార్థులకు అభ్యాస పుస్తకాల (వర్క్‌బుక్)లను అందించారు. ప్రతీ పాఠ్యాంశం పూర్తయిన తర్వాత ఈ వర్క్‌బుక్‌లో దానికి సంబంధించిన డ్రిల్ ఉంటుంది. దీని ద్వారా సంబంధిత అంశంపై పూర్తి అవగాహనతోపాటు, విద్యార్థి సామర్థ్యాలు పెంపొందుతాయి.

ఏయే సబ్జెక్టులకంటే...

భాషాపరమైన తెలుగు, ఇంగ్లిష్‌తోపాటు గణిత పాఠ్యాంశాలకు వర్క్‌బుక్‌లను పంపిణీ చేశారు. విద్యార్థులు పాఠం పూర్తయిన వెంటనే ఇందులో పొందుపర్చిన వర్క్‌షీట్‌లను సాధన చేస్తారు. ఉపాధ్యాయులు ఈమేరకు చొరవ చూపుతారు. ఫలితంగా పాఠంపై పూర్తి పట్టు సాధించే అవకాశం ఉంటుంది.

తల్లిదండ్రుల హర్షం...

వర్క్‌బుక్‌లలోనే ప్రాక్టీస్ చేయాల్సిన వర్క్‌షీట్లు పాఠాల వారీగా ఉన్నాయి. దీంతో విద్యార్థులకు సులభంగా ఉంటుంది. ప్రైవేటు పాఠశాలల్లోని హోంవర్క్ ప్రాక్టీస్ షీట్ల తరహాలోనే ప్రభుత్వ విద్యార్థులకు సైతం ప్రభుత్వం సరఫరా చేసిన అభ్యాస పుస్తకాలు ఉండడంతో జిల్లాలోని విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కళ్ల కలకపై ఆందోళన వద్దు

- డీఎంహెచ్‌వో ధనరాజ్



సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో ధనరాజ్

కడెం: కళ్ల కలక గురించి ఆందోళన చెందొద్దని డీఎంహెచ్‌వో ధనరాజ్ అన్నారు. మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకులంలో 200 మందికిపైగా విద్యార్థులు కళ్ల కలకతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌వో శుక్రవారం పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులను ప్రత్యేక గదుల్లో ఉంచి జాగ్రత్తలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. కళ్ల కలకతో బాధపడే వారు కళ్లను నలపొద్దన్నారు. తరచూ కళ్లను శుభ్రం చేసుకోవాలని తెలిపారు. డాక్టర్ సలహా మేరకు యాంటిబయాటిక్, చుక్కల మందులు వాడాలని సూచించారు. శిబిరంలో డాక్టర్లు నాగరాజు, శివకుమార్, కడెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కడెం బ్యాక్‌వాటర్‌లో విద్యుత్ టవర్లు



దెబ్బతిన్న విద్యుత్ లైన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఈ

కడెం: కడెం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో విద్యుత్ టవర్లు ఏర్పాటు చేసి గంగాపూర్‌కు కరెంటు సరఫరా చేస్తామని ఎస్‌ఈ జయవంత్‌రావు చౌహాన్ తెలిపారు. ఇటీవలి వరదలకు దెబ్బతిన్న విద్యుత్ లైన్‌ను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి గంగాపూర్‌కు భారీ వర్షాలు, వరదల కారణంగా ఏటా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఈ ఏడాది కూడా వరదలకు విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. వాటిస్థానంలో టవర్లు ఏర్పాటు చేసేలా ప్రతిపాదన పంపించాలని సిబ్బందికి సూచించారు. రైతులు వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లను బిగించుకోవాలన్నారు. ఎస్‌ఈ వెంట డీఈ నాగరాజు, ఏడీఏ శ్రీనివాస్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

బండి సంజయ్‌ను కలిసిన రమాదేవి



సంజయ్‌ను సన్మానిస్తున్న రమాదేవి, చిత్రంలో ఎంపీ

భైంసాటౌన్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌ను ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పి.రమాదేవి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపీ సోయం బాపురావుతో కలిసి బండి నివాసంలో కలిసి శాలువాతో సన్మానించారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులైనందుకు అభినందనలు తెలిపారు.

విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం.. ప్రజలకు ప్రాణసంకటం



ప్రియదర్శి నగర్‌లో విద్యుత్ తీగలకు ఏర్పాటు చేసిన కర్ర స్తంభం



ఈ ఫొటోల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఉన్నవి కావు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్‌లోనివి. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఇలా కిందకు వేలాడుతూ ప్రజలను భయపెడుతున్నాయి. వర్షాకాలం కావడంతో షాక్ తగలకుండా కొన్ని చోట్ల స్థానికులే కర్ర స్తంభాలు ఏర్పాటు చేసుకున్నారు. అయినా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని భయపడుతున్నారు. జిల్లా కేంద్రంలోనే ఇలా ఉంటే.. ఇక మారుమూల పల్లెల్లో ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

క్లుప్తంగా

400 మందికి నిత్యాన్నదానం


అన్నదాన సత్రంలో భక్తులు

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన సత్రంలో భక్తుల సంఖ్య 400లకు పెంచారు. శుక్రవారం నుంచి ప్రతి రోజు 400 మంది భక్తులు ఉచితంగా నిత్య అన్నదానం చేసేలా చర్యలు తీసుకున్నారు. గతంలో ప్రతి రోజు 300 మంది భక్తులకు నిత్య అన్నదానం చేసేవారు. శుక్రవారం నుంచి మరో 100 మంది భక్తులకు అదనంగా అన్నదానం చేయనున్నట్లు ఈవో విజయ రామారావు తెలిపారు.

ఖోఖోలో బంగారు పతకం సాధించిన సాయిరాజ్


పతకంతో సాయిరాజ్

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామానికి చెందిన సాయిరాజ్ అంతర్జాతీయ ఖోఖో పోటీల్లో ఇండియా తరపున పాల్గొని బంగారు పతకాన్ని సాధించాడు. ఇటీవల నేపాల్ దేశంలో జరిగిన అంతర్జాతీయ ఖోఖో పోటీల్లో రాణించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. దీంతో కోచ్ అన్నపూర్ణ, గ్రామస్తులు అతడిని అభినందించారు.

దాడిచేసిన వ్యక్తికి ఏడాది జైలు

జన్నారం: కుదువపెట్టిన బంగారం విషయంలో దాడి చేసిన ఒకరికి ఏడాది జైలుశిక్ష, మరో వ్యక్తికి రూ.2వేల జరిమానా విధిస్తూ లక్సెట్టిపేట్ జూనియర్ సివిల్ జడ్జీ, జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ మహమ్మద్ అసదుల్లా షరీఫ్ తీర్పునిచ్చినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం... జన్నారం మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన వొజ్జల లక్ష్మి, రాజన్నల కుమారుడు దామోదర్ అనారోగ్యంతో మృతి చెందాడు. కుమారుడు బతికున్న సమయంలో అతడి భార్య వొజ్జల సింధూజ బంగారం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో కుదువపెట్టారు. బంగారం విడిపించడానికి డబ్బులు కావాలని 2018 ఆగస్టు 11న సింధూజ, ఆమె తండ్రి దండేపల్లి గ్రామానికి చెందిన బొలిశెట్టి లక్ష్మినారాయణ, బొలిశెట్టి శివకుమార్, గ్రామ పెద్ద మనిషి ముత్యాల శంకరయ్యలు వొజ్జల లక్ష్మి ఇంటికి వచ్చి లక్ష రూపాయలు ఇవ్వాలని దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితురాలు లక్ష్మి అదేరోజు ఫిర్యాదు చేసింది. ఈ కేసులో 11మంది సాక్షులను విచారించి నేరం రుజువు చేశారు. దీంతో శివకుమార్‌కు ఏడాది జైలు శిక్ష ఖరారైంది.

అప్రమత్తమయ్యేనా..?

- గోదావరి నది పరీవాహకంలో పలు ఘటనలు
- ఎస్సారెస్పీలో గేట్లు ఎత్తడంతో దిగువ ప్రజల ఆందోళన
- సదర్మాట్ వద్ద కొరవడిన రక్షణ చర్యలు
- ప్రకృతి అందాల మాటున మృత్యు పంజా
- విహారయాత్రకు వచ్చి విగతజీవులుగా మారుతున్న వైనం


సదర్మాట్ వద్ద స్నానాలు చేస్తున్న యువకులు (ఫైల్)

ఖానాపూర్: ఖానాపూర్, కడెం మండలాల పరీవాహకంలోని గోదావరి నది ఏగువన ఉన్న ఎస్సారెస్పీ గేట్లు ఎత్తడంతో దిగువకు వరదనీరు బారీగా వచ్చి గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఉత్తరవాహినీ గౌతమి, గోదావరి నది పరీవాహక ప్రాంతంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో జిల్లా యంత్రాంగం విఫలమవుతోందనే బలమైన ఆరోపణలున్నాయి. దీంతో ప్రజల ప్రాణాలకు రక్షణ కరువైంది. నది పరీవాహక ప్రాంతంలో ఎక్కడో ఒక చోట ఏదో ఒక సంఘటన చోటుచేసుకోవడం దశాబ్దలుగా పరిపాటిగా మారింది. పలువురు ప్రాణాలతో బయటపడినప్పటికీ మరికొందరు మృతిచెందిన బాధిత కుటుంబాల్లో అంతులేని విషాదం నెలకొంటోంది. దీంతో ప్రజలు వర్షాకాలంలో సదర్మాట్ వెళ్లాలన్నా, గోదావరి నది పరీవాహక ప్రాంతాలకు వెళ్లాలన్నా.. హడలిపోతున్నారు. గత కొన్నేళ్లుగా వరుసగా జరిగిన సంఘటనల దృష్ట్యా ఇప్పటికైనా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ప్రజలు కోరుతున్నారు. ప్రకృతి అందాల మాటున మృత్యువును అంచనా వేయక పలువురు విహారయాత్రకు వచ్చి విగతజీవులుగా మారుతున్నారు.

గోదావరికి వెళ్లేది వీరే..

సదర్మాట్‌తో పాటు నది పరీవాహక ప్రాంతాలకు చెందిన ప్రజలు, సందర్శకులు నిత్యం గోదావరి నదిలోకి వెళ్తారు. ప్రధానంగా జాలర్లు, పశువుల కాపర్లు, పర్యాటకులు, కలప స్మగ్లర్లు, రైతులు, గౌడ కులస్తులు, తదితరులు వివిధ పనుల నిమిత్తం వెళ్తుంటారు. వీరితో పాటు పండుగలు, శుభకార్యాల నిమిత్తం, కొందరు సరదాకోసం మరికొందరు వెళ్తుంటారు. అంతేకాకుండా నది పరిసర గ్రామాల్లో శ్మశానవాటికలు పలుచోట్ల గోదావరి లోపల ఇంకొన్నిచోట్ల ఒడ్డునే ఉండడంతో ఎవరైనా చనిపోతే దహనం, ఖననం చేయడానికి గోదావరికే వెళ్తారు. అక్కడే స్నానాలు ఆచరిస్తారు. పరీవాహక ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమైందనే విమర్శలున్నాయి.

నది పరీవాహక గ్రామాలివే..

ఖానాపూర్ మండలంలోని మేడంపల్లి గ్రామం వద్ద గల సదర్మాట్ ప్రాంతం నుంచి వెళ్లే గోదావరి ఖానాపూర్, కడెం, దస్తూరాబాద్ మండలాల్లోని పలు గ్రామాల వెంట వెళ్తోంది. మండలంలోని సదర్మాట్‌తో పాటు ఆయా మండలాల పరిధిలోని సుర్జాపూర్, బాదన్‌కుర్తి, మస్కాపూర్, ఖానాపూర్, దిలావర్‌పూర్, గోడలపంపు, బావాపూర్(కె), లింగాపూర్, ఎల్లగడప, సారంగాపూర్, దిల్‌దార్‌నగర్, బూత్కూరు, గొడిసెర్యాల తదితర గ్రామాలు నది పరీవాహక ప్రాంతంలో ఉంటాయి. ప్రధానంగా సదర్మాట్ ప్రకృతి అందాలను తిలకించేందుకు పర్యాటకులు ఇక్కడికి వానాకాలంతో పాటు వేసవికాలంలోనూ అధికసంఖ్యలో వస్తుంటారు.

సదర్మాట్‌లో చనిపోయిన వారు

- 1995మే నెలలో 10వ తరగతి విద్యార్థులు ఇద్దరు సదర్మాట్‌లో స్నానం చేస్తూ నీటిలో మునిగిపోయారు.
- 1996లో స్వామి నీటిలో మునిగి మృతి చెందాడు
- 1998లో ఆరుగురు విద్యార్థులు చేపలవేటకు వెళ్లారు. ఆ సమయంలో ఎస్సారెస్పీలో 16 గేట్లు ఎత్తారు. దీంతో ముగ్గురు నీటిలో కొట్టుకుపోగా, మరో ముగ్గురు చెట్లకొమ్మలు పట్టుకొని ఉండడంతో వారిని అప్పట్లో హెలికాప్టర్ ద్వారా కాపాడారు.
- 2002లో నిర్మల్‌లోని ఓ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు పిక్నిక్‌కు రాగ, 10తరగతి విద్యార్థి నీటిలో మునిగి చనిపోయాడు.
- 2014 ఆగస్టు 4న ఎండీ జాహెద్ అనే యువకుడు ప్రమాదవశాత్తు సదర్‌మాట్‌లో పడి చనిపోయాడు.
- 2016లో కోరుట్లకు చెందిన విద్యార్థిని అయేషా (12) నీటిలో పడి చనిపోయింది.
- 2017లో నిజామాబాద్‌కు చెందిన శ్రావణ్‌గౌడ్ ఈతకోసం నీటిలోకి దిగి మృతిచెందాడు.
- 2022 మార్చిలో నిర్మల్ పట్టణంలోని కురాన్నపేట్‌కు చెందిన చెందిన తోట లోకేశ్ (22) అమ్మమ్మ ఊరైన ఖానాపూర్‌కు వచ్చి స్నానం చేసేందుకు నీటిలోకి దిగి మృతిచెందాడు.
- 2023లో ఈ నెల17న మెట్‌పల్లికి చెందిన రెహన్(17) నీటిలో దిగి మృతిచెందాడు.
- 12 ఏళ్ల క్రితం బావాపూర్(కె)లో పశువుల కాపర్లు గోదావరి నది కుర్రు(దీవి) ప్రాంతంలో చిక్కుకున్నారు. వారిని యంత్రాంగం వెంటనే ఒడ్డుకు చేర్చలేకపోయింది. దీంతో వారు అక్కడే కొన్ని రోజులు గడిపి నీటి ప్రవాహం తగ్గాక తిరిగి వచ్చారు.
- 7 ఏళ్ల క్రితం మరోసారి బావాపూర్(కె) గ్రామంలో నీటి ప్రవాహంలో పశువులతో పాటు పశువుల కాపర్లు చిక్కుకున్నారు. దీంతో అధికార యంత్రాంగం గజ ఈతగాళ్ల సాయంతో వారిని తిరిగి గ్రామానికి తీసుకువచ్చారు.


సదర్మాట్ వద్ద వరద ఉధృతి


సదర్మాట్ వద్ద చేపలు పడుతున్న స్థానికులు (ఫైల్)

పూర్తిస్థాయి రక్షణ చర్యలు చేపట్టాలి

ప్రతీ రోజు పదుల సంఖ్యలో వచ్చే పర్యాటకులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సదర్మాట్ వద్ద పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించడంతో పాటు గోదావరి నదిలోకి వెళ్లకుండా పకడ్బందీగా రక్షణ చర్యలు చేపట్టాలి. పర్యాటకులు ఎక్కువగా వచ్చే సమయాల్లోనైనా ఇక్కడ ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది. గతంలో అనేక ప్రమాదాలు జరిగిన యంత్రాంగంలో మార్పు లేదు.

– గుగ్లావత్ రాజేందర్‌నాయక్, సర్పంచ్ మేడంపల్లి, ఖానాపూర్

డబ్బులు తీసుకొని పనిచేయడం లేదు

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితుల ఆవేదన


తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధిత మహిళలు

బెజ్జూర్: డబ్బులు తీసుకొని కూడా పనిచేయడం లేదని బెజ్జూర్ మండలం సలుగుపెల్లి గ్రామానికి చెందిన గోవా అమృత, ఆత్రం స్వాతి అనే గిరిజన మహిళలు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒకే ఇంటికి చెందిన వీరికి సలుగుపెల్లి (ఉత్సరంగాపల్లి) రెవెన్యూ శివారులో భూములు ఉండగా అవి విరాసత్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. రూ.20వేలు లంచం ఇస్తేనే పని చేస్తామని తెలుపడంతో తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి కారు డ్రైవర్‌కు ఆ డబ్బులు ఇచ్చారు. అయినప్పటికీ పని చేయకపోవడంతో శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట వాపోయారు. ఈ విషయంపై తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డిని వివరణ కోరగా వారికి సంబంధించిన ఫైల్ ఉన్నతాధికారులకు ఎప్పుడో పంపించామని, నా డ్రైవర్‌కు డబ్బులు ఇవ్వమని నేను చెప్పలేదని, నాకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. ఇది ఎవరో కావాలనే చేస్తున్నట్లుగా ఉందని తెలిపారు.

గుడుంబా తయారీ కేంద్రాలపై దాడులు


దిమ్మదుర్తిలో ముడిపదార్థాలను పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు

మామడ: మండలంలోని దిమ్మదుర్తి గ్రామంలో గుడుంబా తయారీ కేంద్రాలపై శుక్రవారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. గుడుంబా తయారీ కోసం వినియోగించే 100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవికుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన శివరాత్రి చిన్నరాజన్నపై కేసు నమోదు చేసి తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. గుడుంబా తయారు చేసినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది నరేందర్, రషీద్, ముత్యం, ప్రకాష్, వెంకటేష్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

బోథ్: మండలంలోని బాబెరతండాలో గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తిని శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై రాము తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జాదీవ్ అంబు అలియాస్ బుజ్జి గుడుంబా విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఈ దాడిలో ఐదు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్య

ముధోల్: ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని చింతకుంట గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... లింబన్న–శోభల కూతురు రాణి(17) కళాశాలకు వెళ్లాలని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరులేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుతో రైతు మృతి

తలమడుగు: మండలంలోని కజ్జర్ల గ్రామానికి చెందిన రైతు కాకర్ల ఆశన్న(60) పాముకాటుతో శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం... ఆశన్న గురువారం పంట పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా రక్తపింజర పాము కాటువేయగా పంట పొలంలో పడిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలో రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రకు చెందిన జాదవ్ వకీల్(40) శుక్రవారం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. టూటౌన్ సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకాలోని రాజీనాయక్‌తండాకు చెందిన జాదవ్ వకీల్ తన పంట చేనులో పత్తి పంట సాగు చేస్తున్నాడు. ఇటీవల కురిసిన వర్షాలకు గడ్డి ఏపుగా పెరగడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు గురువారం రాత్రి రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

అనుమతి వచ్చేనా..?

బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ) కళాశాల పేరు శుక్రవారం అసెంబ్లీలో ప్రస్తావనకు వచ్చింది. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో విద్యార్థులకు తగిన రీతిలో శిక్షణ ఇప్పించడానికి సీవోఈలో లాంగ్ టర్మ్ కోచింగ్‌ను ప్రారంభించడానికి అనుమతి ఇప్పించాలని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రభుత్వాన్ని కోరడం ప్రాధాన్యతను సంతరించుకుంది. లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు అనుమతి ఇవ్వడంతో ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని ఎందరో పేద విద్యార్థులు పోటీ పరీక్షల్లో నెగ్గడానికి దోహదం కానుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- బెల్లంపల్లి సీఓఈలో లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు ఎదురుచూపులు


సీవోఈ కళాశాల భవనం

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బెల్లంపల్లి బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీఓఈ) జూనియర్ కళాశాలలో లాంగ్ టర్మ్ కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించాలనే డిమాండ్ ప్రధానంగా వినబడుతోంది. ప్రైవేట్, కార్పొరేట్ విద్యార్థులకు ఏమాత్రం తీసిపోకుండా సీఓఈలో నాణ్యమైన విద్యాబోధన జరుగుతోంది. ఓ వైపు ఇంటర్మీడియట్ విద్యాబోధన చేస్తూనే మరో వైపు జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నారు. ప్రత్యేకంగా లాంగ్‌టర్మ్ కోచింగ్ లేకపోయినా జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో విద్యార్థులు పోటీపడి చదివి ఉత్తీర్ణత సాధిస్తూ సీవోఈకి వన్నె తెస్తున్నారు. ఉత్తమ ర్యాంకులతో బెల్లంపల్లి సీవోఈ పేరును ఉత్తర తెలంగాణలో మారుమ్రోగిస్తున్నారు. విద్యా సౌరభాలను వెదజల్లుతున్న సీఓఈ కళాశాలలో లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు అవకాశం కల్పిస్తే పేద విద్యార్థుల దశ దిశ మారేందుకు అవకాశాలు మెండుగా ఉంటాయనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

పాఠశాల నుంచి సీవోఈకి ఎదిగి....

2014 జులై 11న బెల్లంపల్లి కేంద్రంగా ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల మంజూరైంది. అదే ఏటా రైల్వే రడగంబాల బస్తీలో ఓ అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య విద్యార్థులకు బోధన ప్రారంభించారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో గురిజాలకు వెళ్లే మార్గంలో ఆధునిక హంగులతో పక్కా భవనాన్ని నిర్మాణం చేసి 2016 జూన్ 6న కొత్త భవనంలోకి మారారు. పదో తరగతి వరకే పరిమితమైన గురుకుల విద్యాలయం 2018లో జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ అయింది. అదే సంవత్సరం సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జూనియర్ కళాశాలను సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీగా ప్రకటించింది. 2018–20లో సీవోఈ నుంచి ఇంటర్మీడియట్ మొదటి బ్యాచ్ విద్యార్థులు 63మంది చదువు పూర్తి చేసి బయటకు వెళ్లగా 2019–21లో 65 మంది, 2020–22లో 73 మంది విద్యార్థులు విజయవంతంగా చదువు పూర్తి చేశారు. 2021–23లో నాల్గో బ్యాచ్ విద్యార్థులు 63 మంది పరీక్ష రాసి పాసయ్యారు. బెల్లంపల్లి సీవోఈ విద్యార్థులు ఏటా ఇంటర్మీడియట్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తుండగా, వీరిలో సగటున 80 శాతం మంది విద్యార్థులు మాత్రమే సీవోఈ లక్ష్యాలను అందుకుంటున్నారు.

లాంగ్‌టర్మ్ కోచింగ్ హైదరాబాద్‌కే పరిమితం..

సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ మెరుగైన విద్యాబోధన కోసం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీలను ఏర్పాటు చేసింది. ప్రతి ఉమ్మడి జిల్లాలో బాలబాలికల కోసం వేర్వేరుగా సీఓఈ కళాశాలలను ప్రారంభించగా, వీరికి లాంగ్‌టర్మ్ కోచింగ్ మాత్రం కేవలం హైదరాబాద్ పరిసర ప్రాంతాల సీఓఈల్లో ఇస్తున్నారు. అనేక మంది లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు హైదరాబాద్ వెళ్లలేక ఉన్నత లక్ష్యాలను సాధించడంలో వెనుకకు నెట్టేయబడుతున్నారు.

ఆకర్శిస్తున్న బెల్లంపల్లి సీవోఈ..

ఉత్తమ ఫలితాలతో బెల్లంపల్లి సీవోఈ విద్యార్థుల మదిని దోచుకుంటోంది. ఇక్కడి సీవోఈలో చదవడానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల విద్యార్థులు సీఓఈ ప్రవేశపరీక్ష రాసి సీటు దక్కించుకుని ప్రథమ ప్రాధాన్యత బెల్లంపల్లి సీవోఈకి ఇచ్చి ప్రవేశం పొందుతున్నారు. అలాంటి బెల్లంపల్లి సీవోఈలో లాంగ్‌టర్మ్ కోచింగ్‌ను ప్రారంభించడానికి ప్రభుత్వం అనుమతి మంజూరు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉత్తర తెలంగాణలో టాప్ బెల్లంపల్లి...


విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు (ఫైల్)

ఉత్తర తెలంగాణలో ఉన్న సంక్షేమ గురుకుల సీఓఈల్లో బెల్లంపల్లి సీఓఈ ఉన్నతంగా రాణిస్తోంది. ఇప్పటి వరకు ఇంటర్మీడియట్ నాలుగు బ్యాచ్‌లు బయటకు వెళ్లి నీట్ పోటీ పరీక్షరాసి 14 మంది విద్యార్థులు మెడిసిన్‌లో సీటు దక్కించుకోగా, జేఈఈ ప్రవేశ పరీక్ష ద్వారా ఐఐటీ, ఎన్ఐటీ, త్రిపుల్ ఐటీ, జీఎఫ్‌టీఐ వంటి ప్రతిష్టాత్మకమైన విద్యా సంస్థల్లో మరో 14మంది విద్యార్థులు సీటు సాధించారు. ఐకార్, ఐజర్, ఢిల్లీ యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీల్లో 18మంది విద్యార్థులు సీటు కైవసం చేసుకుని సత్తా చాటారు. ఇండియన్ నేవీ, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ స్పేస్ టెక్నాలజీ వంటి వంటి పలు జాతీయస్థాయి విద్యాలయాల్లో మరో 32మంది సీటు దక్కించుకోవడం విశేషం. వీటితో పాటు ఎంసెట్ ద్వారా జేఎన్‌టీయూ (హెచ్)లో 15మంది, మిగతా పలు ఇంజినీరింగ్ కళాశాలల్లో 38మంది విద్యార్థులు ఇంజినీరింగ్ కోర్సులో ప్రవేశం పొందారు. ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సుల్లో 12మంది విద్యార్థులు ఉస్మానియా, కాకతీయ, కళింగ, అజీమ్ ప్రేమ్‌జీ వంటి విద్యాసంస్థల్లో సీటు సాధించి బెల్లంపల్లి సీవోఈ ప్రతిష్టను ఇనుమడింపజేశారు.

బెల్లంపల్లికి అవకాశం కల్పించాలి



విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించడంలో బెల్లంపల్లి సీఓఈ ప్రత్యేకతను చాటుకుంటోంది. జాతీయస్థాయి పోటీ పరీక్షల కోసం లాంగ్ టర్మ్ కోచింగ్ సౌకర్యాన్ని కల్పించినట్లైతే మరింత రెట్టింపు స్థాయిలో ఫలితాలు వచ్చేందుకు అవకాశాలు మెరుగుపడతాయి. ఎందరో పేద విద్యార్థులు ఉన్నత చదువులకు అవకాశాలను అందిపుచ్చుకుంటారు. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుని బెల్లంపల్లి సీఓఈలో లాంగ్ టర్మ్ కోచింగ్‌కు అనుమతి ఇవ్వాలి.

– దుగుట శ్రీనివాస్, పేరెంట్, బెల్లంపల్లి

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై రాజేందర్ వివరాల ప్రకారం... ఇర్ఫాన్ అలీ(19) రైళ్లలో సమోసాలు అమ్ముకుంటూ జీవనం సాగించేవాడు. ఐదు నెలల క్రితం షమీణ అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వివాహం అనంతరం సప్తగిరి కాలనీలోని అద్దె ఇంట్లో ఉంటున్నాడు. కొంత కాలంగా సమోసాలు విక్రయించడం మానేసి మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం మద్యం మత్తులో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.